# కరీంనగర్ వార్త

కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల

గురువారం 30, నవంబర్ 2023 8 పేజీలు


## జిడికె 11వ గని పాత రోడ్డు పున: ప్రారంభించాలి



3లో...

# ఎన్నికలకు సర్వం సిద్ధం

2లో..



మూడు నియోజకవర్గాల పరిధిలో 838 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణ

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి

ప్రలోభాలకు గురి కాకుండా ప్రతీ ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద పోలింగ్ సామాగ్రి పంపిణీ సమయంలో అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్

**పెద్దపల్లి జిల్లా బ్యూరో/ పెద్దపల్లి/ గోదావరిఖని, ప్రభాతవార్త:** జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ రామగుండం అసెంబ్లీ నియోజక వర్గం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రానా, మంథని, పెద్దపల్లి ఎన్నికల సాధారణ పరిశీలకులు సిఎస్.శ్రీధరలతో కలిసి రామగుండంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఆవరణలో, మంథనిలోని జెఎన్‌టియుసి ఇంజనీరింగ్ కళాశాల, పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

## పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి జిల్లాలో సుమారు 3,000 మంది జిల్లా, కేంద్ర పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు

జిల్లాలో ఎన్నికల నియామావళి ఉల్లంఘనకు సంబంధించి 40 కేసులు నమోదు

జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



16లో...

**జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :** జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఇతర శాఖల సమన్వయంతో కలిసి పని చేస్తున్నామని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. తద్వారా జిల్లాలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పిస్తున్నాం. శాంతి యుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి జిల్లాలో సుమారు 3,000 మంది జిల్లా, కేంద్ర పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.

## 30న వేతనంతో కూడిన సెలవు మంజూరు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ కమీషనర్ ఆఫ్ లేబర్ శామ్యూల్ జాన్

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రతి వాణిజ్య సంస్థ, దుకాణం, వ్యాపార సంస్థలలో పని చేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ కమీషనర్ ఆఫ్ లేబర్ శామ్యూల్ జాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని దుకాణ, వాణిజ్య సంస్థల యాజమానులకు, వ్యాపార సంస్థల యాజమానులు 30న గురువారం రోజున తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సాధారణ ఎన్నికల సందర్భంగా తమ దుకాణ, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పని చేయుచున్న కార్మికులకు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని అన్నారు.

2లో...

# ఎన్నికలకు సర్వం సిద్ధం

మొదటి పేజి తురువాయి..

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవిఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని, రిజర్వ్ ఈవిఎం యంత్రాలు, రిజర్వు పోలింగ్ సామగ్రి, సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం మీడియాతో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ఉన్న 3 అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో మొత్తం 838 పోలింగ్ కేంద్రాలలో 7లక్షలకు పైగా ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. జిల్లాలో ఉన్న ఓటర్లందరూ తప్పనిసరిగా నవంబర్ 30న జరిగే పోలింగ్‌లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి, వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన తాగునీటి, టాయిలెట్ ఇతర వసతులు కల్పించామని అన్నారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన ర్యాంప్, ట్రైసైకిళ్లు ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు



బలగాలను మోహరించామని తెలిపారు. జిల్లాలో అధిక పోలింగ్ శాతం నమోదయ్యే విధంగా విస్తృతంగా ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని, జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్‌ను నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ, పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి సిహెచ్.మధుమోహన్, మంథని రిటర్నింగ్ అధికారి హనుమ నాయక్, మంథని ఆర్డీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి తూము రవీందర్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# ఏజెన్సీలోని ఆసుపత్రులను సందర్శించిన డిఎంహెచ్ఓ

గూడూరు, నవంబర్ 29, ప్రభాతవార్త

ఏజెన్సీ ప్రాంతంలోని గూడూరు, కొత్తగూడ, గంగారం మండలాల్లోని ప్రభుత్వ వైద్యశాలలు, వెల్‌నెస్ సెంటర్లను జిల్లా వైద్యాధికారి డాక్టర్ అంబరీష బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రులలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించిన అంబరీష అక్కడ అందిస్తున్న వైద్య సేవల గురించి సమీక్షించారు. డిఎంహెచ్ఓ తన సందర్శనలో భాగంగా గూడూరు మండలంలోని భూపతిపేట వెల్‌నెస్ సెంటర్‌తో పాటు కొత్తగూడ పిహెచ్‌సి, పోగుళ్లపల్లి, వేలుబెల్లి వెల్‌నెస్ సెంటర్లు, కోమట్లగూడెం, గంగారం పిహెచ్‌సిలతో పాటు బత్తులపల్లి హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసారు. ఆయా కేంద్రాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణీ స్త్రీలందరికీ టిడి వ్యాక్సినేషన్ చేయాలని, వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అసంక్రమిత వ్యాధులను ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స అందించాలన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించి వారు పరిసరాల పరిశుభ్రత పాటించేలా సూచించాలని కోరారు. క్షయ వ్యాధిని గుర్తించేందుకు తెమడ పరీక్షలు చేయాలని, ముఖ్యంగా రక్తహీతన ఉన్న వారిని గుర్తించి ఐరన్ ఫోలిక్ ట్యాబ్లెట్లను ఇవ్వాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. డిఎంహెచ్ఓ వెంట ఎస్‌యుఓ శ్రీనివాస్, డిపిఎం రుక్మొద్దీన్ ఉన్నారు.



# మోడల్ పోలింగ్ కేంద్రాల ముస్తాబు

గూడూరు, నవంబర్ 29, ప్రభాతవార్త

మండలంలో మాడల్ పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేసిన కేంద్రాలను ప్రభుత్వ మార్గదర్శ కాలకు అనుగుణంగా ముస్తాబు చేసారు. ఓటర్లను ఆకట్టుకునే విధంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో స్వాగత ఏర్పాట్లు చేసారు. మండలంలో మొత్తం 51 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో మూడు కేంద్రాలను మాడల్ పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేసారు. గూడూరులోని గ్రామపంచాయతి కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌ను మాడల్ పోలింగ్ కేంద్రంగా, చంద్రుగూడెంలోని బాలికల ఆశ్రమోన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని విమెన్ పోలింగ్‌స్టేషన్‌గా , మండలంలోని తేజావత్‌రాంసింగ్‌తండాలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని యూత్ పోలింగ్ స్టేషన్‌గా ఎంపిక చేసారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు స్థానిక ఐకెపి అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో మాడల్ పోలింగ్ కేంద్రాలను ముస్తాబు చేసారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా బారికేడ్ల ఏర్పాటుతో పాటు ప్రధాన ద్వారాల వద్ద కొబ్బరి ఆకులు, పూలదండలు కట్టి ఓటర్లను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దారు. ఓటరు అవగాహన అంశాలతో కూడిన రంగురంగుల ముగ్గులు వేసారు. పోలింగ్ సిబ్బంది బుధవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకునే లోపే మాడల్ కేంద్రాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసారు. ముస్తాబు ప్రక్రియలో పాలు పంచుకున్నారు.



# సాయి మందిరానికి పధ్నాలుగేళ్లు

### 1న త్రయోదశ వార్షికోత్సవం



గూడూరు, నవంబర్ 29, ప్రభాతవార్త

ఇద్దరు పోలీసు అధికారుల మస్తిష్కంలో మెరిసిన ఆలోచన ఆచరణరూపం దాల్చి ఇప్పటికి పధ్నాలుగేళ్లు. ఆద్యాత్మిక చింతనతో మొదలు పెట్టిన కార్యక్రమం విజయవంతంగా పూర్తయి వారిందించిన సేవలకు గుర్తుగా నిలిచింది. అదే గూడూరులోని శ్రీషిరిడి సాయినాథుని మందిరం. ఇద్దరి ప్రయత్నంతో అనేకమంది భాగస్వాములై వారి సహాయ సహకారాలతో రూపుదిద్దుకున్న గూడూరు సాయినాథుడి మందిరానికి పదమూడు వసంతాలు పూర్తయి పధ్నాల్గవ యేడుకు చేరుకుంటున్న క్రమంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం ఇక్కడ పోలీసు అధికారులుగా పని చేసిన ఇద్దరు సాయి భక్తులు గుడి నిర్మాణానికి పునాది వేయడంతో పాటు సర్వాంగ సుందరంగా సాయినాథుని మందిరం నిర్మించడంలో కృతకృత్యులయ్యారు. ఆనాడు వందలు మొదలుకొని లక్షల రుపాయల వరకు నగదు, స్థలాలు, వస్తు రూపేణా తమ వంతు సాయంగా అందించిన ఎంతోమంది భాగస్వామ్యంతో నిరా ్మణమైన గుడిలో అప్పటి నుండి ఇప్పటి వరకు ఆ సాయినాథుడు నిత్యపూజలు, హారతులు అందుకుంటున్నాడు. ప్రతి సంవత్సరం గురుపూర్ణిమతో పాటు వార్షికోత్సవ వేడుకలను ఘనంగా ఈ గుడిలో నిర్వహించడం ఆనాటి నుండి ఆనవాయితిగా వస్తున్నది. ఇందులో భాగంగా వచ్చే నెల 1న (డిసెంబర్) కార్తీక బహుళ చవితి రోజున కూడా మందిర త్రయోదశ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం నుండి బాబా గుడిలో ప్రత్యేక పూజా కార్యక్ర మాలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసారు. కరపత్రాల రూపంలో ఈ కార్యక్రమాలను ప్రచారం కూడా చేస్తున్నారు. ఉదయం సు ప్రభాత సేవతో మొదలయ్యే వార్షికోత్సవ వేడుకలో బాబాను అలంకరించి మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు విశిష్ఠదర్శనం కల్పించనున్నారు. తీర్థప్రసాదాల వితరణ అనంతరం పట్టణంలోని గొల్లగూడెం ప్రాంతానికి చెందిన దివంగత చీర మల్లయ్య, లక్ష్మిల స్మారకార్థం గూడూరు హెచ్ఎంగా పని చేస్తున్న వారి పుత్రుడు చీర భిక్షపతి, విజయ దంపతుల ఆధ్వర్యంలో గుడి ప్రాంగణంలో అన్నదాన కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు కమిటి ప్రతినిధులు తెలిపారు. సాయినాథుని విశిష్ఠ దర్శన కార్యక్రమానికి ముందు విగ్రహానికి భక్తులు పాలాభిషేకాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బాబా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ వార్షికోత్సవ వేడుకను విజయవంతం చేయాలని కోరారు.



### 30న వేతనంతో కూడిన

# సెలవు మంజూరు

మొదటి పేజి తురువాయి..

తెలంగాణ షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 1988చట్ట ప్రకారం యాజమానులు తప్పనిసరిగా మూసివేసి కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శామ్యూల్ జాన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో సకల ఏర్పాట్లు పూర్తి

**- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్**

పెద్దపల్లి జిల్లా బ్యూరో/ పెద్దపల్లి, ప్రభాతవార్త.

పోలింగ్ కేంద్రాల్లో సజావుగా పోలింగ్ నిర్వహణకు సకల ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం పెద్దపల్లిలోని జడ్పిహెచ్ఎస్ బాలికల పాఠశాల, అమర్ చంద్ కల్యాణ మండపం సమీపంలో రిక్రియేషన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ కాన్ మాట్లాడుతూ సజావుగా పోలింగ్ నిర్వహిం చేందుకు పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు కట్టుది ట్టంగా చేయాలని కలెక్టర్ అధికా రులకు సూచించారు. రిక్రియేషన్ క్లబ్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద దివ్యాంగుల కోసం ట్రైసైకిళ్లు, ర్యాంపులు ఏర్పాటు చేశామని, వాటిని పూర్తి స్థాయిలో



వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులున్నారు.

# జిడికె 11వ గని పాత రోడ్డు పున: ప్రారంభించాలి

**- కార్మికుల మెరుపు సమ్మె, కార్మిక సంఘాల మద్ధతు**

గోదావరిఖని, ప్రభాతవార్త.



జిడికె 11వ గని కార్మికులు తురుచూ ప్రమాదాలకు నిలయంగా మారిన కొత్త రోడ్డు స్థానంలో పాత రోడ్డు పునర్ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున గని కార్మికులు ఆందోళనకు దిగారు. ఓసిపి 5 ప్రారంభంతో పాత రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు దాదాపు 15 కిలోమీటర్లు వేయడం జరిగిందని, ఈ కొత్త రోడ్డు కార్మికులకు ఏ రకంగానూ అనుకూలంగా లేదని, గత ప్రారంభం నుంచి సిఐటియు తరుపున కార్మికులు ఆందోళన చేసినప్పటికీ పాత రోడ్డు పున: ప్రారంభించకపోవడంతో కొత్త రోడ్డుతో దాదాపు చాలా మంది కార్మికులు ప్రమాదాలకు గురయ్యారని, చనిపోయిన సందర్భాలు ఉన్నాయని, పెద్ద ఎత్తున సిఐటియయు జిడికె 1, 3వ ఇంక్లయిన్ జంక్షన్ వద్ద రాస్తారోకోను బుధవారం నిర్వహించారు. అయినప్పటికీ యాజమాన్యం పెడచెవిన పెట్టి అదే మార్గంలో కార్మికులు, ప్రయాణికులు మంథని, భూపాలపల్లికి వెళ్లే బస్సులు, లారీ బొగ్గు ట్రాన్స్‌పోర్టు, నిత్యం రద్దీగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని సిఐటియు అనుబంధ సింగరేని కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. కొత్త రోడ్డు మొత్తం కూడా మూలమలుపులు, స్పీడ్ బ్రేకర్లు ఉండటం, బొగ్గు లారీ ట్రాన్స్‌పోర్టు పెద్ద పెద్ద లోడ్లు ఎలాంటి పైకప్పు కవరేజ్ లేకుండా లారీలు రావడం వల్ల బొగ్గు పెల్లలు కార్మికుల మీద పడి ప్రమాదాలు జరుగుతున్నాయని, మంగళవారం కె.సంపత్ అనే కార్మికులు ప్రమాదంలో మరణించడానికి కారణం కూడా బొగ్గు పెల్ల లారీపై నుంచి పడి వెంటనే లారీ కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో పెద్ద ఎత్తున కార్మికులు ఆగ్రహానికి గురై ఆందోళనల నిర్వహించడంతో సిఐటియు కార్మిక సంఘాలన్ని కూడా అక్కడికి చేరుకొని పాత రోడ్డును పరిశీలించడం జరిగిందని, అయినప్పటికీ యాజమాన్యం కార్మికుల ప్రాణాలను లెక్కలోకి తీసుకోకుండా కొత్త రోడ్డునే కొనసాగిసా _మని చెప్పడంతో మెరుపు సమ్మె చేపట్టినట్లు తెలిపారు. దీనికి పూర్తి బాధ్యతసింగరేణి యాజమాన్యమే వహించాల్సి ఉంటుందని సిఐటియు తరుపున ఆయన విజ్ఞప్తి చేస్తూ, కార్మికుల ప్రాణాలను రక్షణ లేనటువంటి ఈ కొత్త రోడ్డు మార్గాన్ని తక్షణమే రద్దు చేసి పాత రోడ్డు మార్గాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## నేటి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**- గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సాయుధ పోలీసుల చెకింగ్‌లు**

**- సిఐ ప్రమోద్ రావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు**

గోదావరిఖని, ప్రభాతవార్త.

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గోదావరిఖని పట్టణంలో రామగుండం నియోజక వర్గం ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 2లక్షల 19వేల 872 ఓట్లు ఉన్న రామగుండం నియోజక వర్గంలో అన్ని పోలింగ్ బూత్‌లు పర్యటించి సిద్ధం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వన్‌టౌన్ సిఐ ప్రమోద్ రావు ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సాయుధ బలగాలు మోహరించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో వచ్చిపోయే కార్లను, అనుమానం వచ్చిన వెహికిల్స్ అన్ని కూడా ఆపి పూర్తిగా సోదాలు చేస్తున్నారు. ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు 48గంటల సైలెంట్ పర్యవేక్షణలో అభ్యర్థులు కూడా సాయంత్రం నుంచి బహిరంగ ప్రచారాన్ని నిలిపివేశారు. పట్టణంలో అంతకు ముందు ఉన్న మైకులు, డిజె సౌండ్‌లు, మాస్ వీడియోలు, పాటల, డ్యాన్స్‌ల ప్రచారాలు అన్ని నిలిచిపోయాయి. అభ్యర్థులు కూడా సైలెంట్ మోడ్‌లోనే తమ మిత్రులను, శ్రేయోభిలాషులను స్వయంగా కలిసి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని పోలీస్ వర్గాలు తెలిపారు.



## తనిఖీలలో జప్తు చేసిన 4 కోట్ల 90లక్షల ఒకవేయి 360 రూపాయల్లో కోటి 23లక్షల 72వేల 360 రూపాయల విడుదల

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త.

తనిఖీలలో ఇప్పటి వరకు జప్తు చేసిన 4 కోట్ల 90లక్షల ఒక వేయి రూపాయల్లో, కోటి 23లక్షల 72 వేల 360 రూపాయలు విడుదల చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటి వరకు 4 కోట్ల 90లక్షల ఒక వేయి 360 రూపాయల నగదు జప్తు చేసి, సంబంధిత వ్యక్తులు సమర్పించిన ఆధారాలను తనిఖీచేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీ, కోటి 23లక్షల 72వేల 360 రూపాయల నగదును విడుదల చేసినట్లు తెలిపారు. సరైన ఆధారాలు సమర్పించినందున 3 కోట్ల 66లక్షల 29వేల రూపాయల నగదు విడుదల చేయలేదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు స్పందిస్తున్నామని, ఇప్పటి వరకు సి విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 251 ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఇప్పటి వరకు 1752 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిష్కరించామని కలెక్టర్ తెలిపారు.

## డిసెంబర్ 1న స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు

**- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్**

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త.

ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు డిసెంబర్ 1న స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 29, 30న ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు డిసెంబర్ 1న స్పెషల్ క్యాజువల్ లీవ్ ప్రకటిస్తున్నామని, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పాఠశాల, ఇంటర్మీడియట్, కళాశాల విద్య, టెక్నికల్ విద్యాశాఖ, రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ పబ్లిక్ సెక్టార్ యూనిట్లలో పని చేసే ఉద్యోగులకు ఈ స్పెషల్ క్యాజువల్ లీవ్ అమలవుతోందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పెద్దపల్లి వార్త

## పోలింగ్ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలి

**- అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్**

పెద్దపల్లి జిల్లా బ్యూరో/ పెద్దపల్లి, ప్రభాతవార్త.



అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ విధులను సిబ్బంది కట్టుదిట్టంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ సూచించారు. బుధవారం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను, పెద్దపల్లి, మంథని సాధారణ ఎన్నికల పరిశీలకులు సిఎన్.శ్రీధరతో కలిసి అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 30న పెద్దపల్లి నియోజక వర్గంలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మంథనిలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేశామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్, ఇతర పోలింగ్ సామాగ్రిని అప్పగించామని, రిజర్వ్ పోలింగ్ సామగ్రి సెక్టార్ అధికారుల వద్ద అందుబాటులో ఉంటుందని, పోలింగ్ కేంద్రాలలో యంత్రాలు, మరమ్మత్తుకు గురైతే సెక్టార్ అధికారులు తమ వద్ద ఉన్న రిజర్వ్ యంత్రాలను వెంటనే అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి మధుమోహన్, మంథని రిటర్నింగ్ అధికారి హనుమ నాయక్, సంబంధిత అధికారులు తదితరులున్నారు.

## గిరిజనులకు రవాణా కష్టాలు ..!

మేడారం,ప్రభాతవార్త :

అటవీ గ్రామాల గిరిజనులకు రవాణా కష్టాలు తప్పని విధంగా ఉన్నాయి. శతాబ్దాల కాలంగా రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడం మూలంగా గిరిజనులకు రవాణా లేకుండా పోయింది. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండల కేంద్రానికి దూరంగా విసిరిపారేసినట్లుగా అడవుల్లో 50 కిలో మీటర్ల దూరంలో ఉంటున్నారు. గుట్టల మధ్యలో అడవుల్లో ఉంటున్న బంధాల గ్రామపంచాయతీ పరిధిలోని పోచాపురం, నర్సాపురం, బొల్లెపల్లి, అల్లిగూడెం గ్రామాలకు వెళ్ళాలంటే రోడ్డు లేదు. కొడిశెలకు కిలోమీటర్ దూరంగా ప్రధాన రోడ్డు నుండి అడవిలోకి వెళ్ళాల్సి ఉంటుంది. పోచాపురం గుట్ట దాటితో వాగు వస్తుంది. ఆ తరువాత ఎడమవైపున బందాల గ్రామం ఉంటుంది. కుడి వైపుకు వెళితే గొల్లెపల్లి, అల్లిగూడెం, నర్సాపురం గ్రామాలు కిలోమీటర్ దూరానికి ఒకటి ఉంటుంది. బంధాల గ్రామానికి చెందిన ఆగబోయిన సంధ్య అనే యువతికి అనారోగ్యం భారిన పడింది. కావడిలో వేసుకుని గ్రామస్తులు 10 కిలోమీటర్లు మోసుకుని రోడ్డుకు చేర్చారు. కొడిశెల నుండి అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా గిరిజన గ్రామాలకు రోడ్లు మాత్రం వేయడం లేదంటున్నారు.

# పోలింగ్‌కు పటిష్టమైన బందోబస్తు

**- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు**

**- రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరీ**





**పెద్దపల్లి జిల్లా బ్యూరో/ గోదావరిఖని, ప్రభాతవార్త:** రామగుండం కమీషనరేట్ పరిధిలోని రెండు జిల్లాలో నేడు జరుగున్న పోలింగ్ సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరీ తెలిపారు. భారత ఎన్నికల కమీషన్ ఆదేశాల ప్రకారం రామగుండం కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో ఉన్న 6 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి సెక్టార్ అధికారులు, పోలీస్ రూట్ మొబైల్ అధికారులు, ఆర్మడ్ అధికారులతో పోలింగ్ అధికారులను, పోలింగ్ పరికరాలను పోలింగ్ లొకేషన్‌లకు పటిష్టమైన భద్రతతో తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో రామగుండం నియోజక వర్గం జడ్పిహెచ్‌ఎస్ టిటిఎస్ ఎన్టీపీసీ జ్యోతినగర్, రామగుండం, మంథని నియోజక వర్గం జెఎన్‌టియుహెచ్ యూనివర్శిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ మంథని, పన్నూర్, రామగిరి మండలం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లను, మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల నియోజక వర్గం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మంచిర్యాల, బెల్లంపల్లి నియోజక వర్గం, జడ్పిఎస్ఎస్ బజార్ ఏరియా బెల్లంపల్లి, చెన్నూర్ నియోజక వర్గం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ చెన్నూర్ (ఎల్లక్కపేట్)లలోని పోలింగ్ పరికరాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లను బుధవారం రామగుండం సిపి రెమా రాజేశ్వరీ సందర్శించారు. ఈ సందర్భంగా ఏసిపిలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి పోలింగ్ బందోబస్తు, భద్రతపై ఆదేశాలు, పలు సూచనలు చేశారు. రామగుండం కమీషనరేట్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు పటిష్టమైన భద్రత బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లా పరిధిలో 1291 మంది అధికారులు, సిబ్బంది, 6 కేంద్ర బలగాల కంపెనీలు, 500 మంది మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హోంగార్డ్స్‌ను, మంచిర్యాల జిల్లాలో 1762 మంది అధికారులు, సిబ్బంది, 10 కేంద్ర బలగాల కంపెనీలు, 650 మంది ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన హోంగార్డ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ర ఆటల నుంచి వచ్చిన ఒక పోలీస్ టీమ్‌ను పోలింగ్ బందోబస్త్‌కు వినియోగించడం జరుగుతుందని తెలిపారు. పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు మానిటరింగ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, 16 కేంద్రల బలగాల సిబ్బంది ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన పోలీసులకు జూమ్ మీటింగ్ నిర్వహించి, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు వారి యొక్క బాధ్యతలు, డ్యూటీలపై బ్రీఫింగ్ ఇవ్వడం జరిగిందని సిపి తెలిపారు. రామగుండం కమీషనరేట్ పరిధిలో 48గంటల పాటు సైలెన్స్ పీరియడ్‌లో అన్ని లాడ్జీలు, ఫంక్షన్ హాల్‌లో, గెస్ట్ హౌస్‌లను చెక్ చేసి ఇక్కడ ఓటు హక్కు లేకుండా బయట నుంచి వచ్చిన వ్యక్తులను బయటకు పంపడం జరుగుతుందని, ఆకస్మికంగా వాహనాల తనిఖీల నిర్వహణ, ఓటర్లను ప్రభావితం చేసే ప్రజలను ప్రలోభాలకు గురి చేసే డబ్బులు, వస్తువులు పంచకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు 144 సెక్షన్ అమలు చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల జిల్లా పరిధిలో 1989 మంది వ్యక్తులను బైండోవర్ చేసినట్లు, పెద్దపల్లి జిల్లాలో 2231 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంత పోలింగ్ లోకేషన్లలో ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని, సరిహద్దు రాష్ట్రాల ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిరంతర నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల ప్రవర్తన నియమావళి నియమ, నిబంధనలు ఉల్లంఘించి, ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగించిన, అల్లర్లకు గొడవలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిపి హెచ్చరించారు.

## ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలి

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




**వేములవాడ, ప్రభాతవార్త:** ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి, ఎన్నికల రోజు, ఎన్నికల తరువాత పోలీసులు నిర్వహించాల్సిన బందోబస్తు విధులపై ఎస్పీ పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల వేళ రూట్ బందోబస్తు, పోలింగ్ స్టేషన్ బందోబస్తు, పెట్రోలింగ్ పార్టీ పోలీసులు నిర్వహించాల్సిన విధులను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా శాంతియుతంగా జరిగేందుకు ప్రతీ ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు ఉండేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సరి చూసుకోవాలని, ఓటర్లు క్యూలైన్లు పాటించే విధంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. రూట్ బందోబస్తు, పెట్రోలింగ్ పార్టీలు ఈ రోజు నుంచి వారికి కేటాయించిన రూట్‌లలో, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు గల రూట్‌లలో ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టే వారిపై నిఘా పెట్టాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారైనా, ఎవరైనా ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడినట్లయితే తక్షణమే సంబంధిత పై అధికారులకు తెలపాలని అన్నారు. ఓటర్లకు భరోసా కలిగించే విధంగా ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలని పోలీసు అధికారులకు, సిబ్బందికి తెలిపారు. అనంతరం వేములవాడ పట్టణంలోని ఇవిఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్ర చారి, సిఐ కరుణాకర్‌లతో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్ర చారి, సిఐలు కరుణాకర్, కృష్ణ కుమార్, కిరణ్ కుమార్, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

# వేములవాడ అసెంబ్లీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

**వేములవాడ, ప్రభాతవార్త:** వేములవాడ అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమయ్యింది. పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామాగ్రిని సంబంధిత అధికారులు, సిబ్బందికి అందజేశారు. పటిష్టమైన బందోబస్తు మధ్య ఎన్నికల సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలించారు. గురువారం ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుంది. సమస్యాత్మక ప్రాంతాలుగా 45 కేంద్రాలను గుర్తించగా, అక్కడ సాయంత్రం నాలుగు గంటల వరకు మిగిలిన ప్రాంతాల్లో సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. వేములవాడ ఎన్నికల కోసం నియోజక వర్గంలో 260 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో పురుషులు 1,04,943, మహిళలు 1,13,186, ఇతరులు 31 మొత్తం 2,18,160 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.





## ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

**- జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**






**జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :** జిల్లాలో స్వేఛ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీస్ అధికారులు,సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు.ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లాకు వచ్చిన పోలీస్ అధికారులు,సిబ్బందితో జిల్లా కేంద్రంలోని బిఎల్‌ఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ కార్యక్రమం నిర్వహించారు.సార్వత్రిక ఎన్నికల విధులకు వచ్చిన సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్,వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీస్ అధికారులు,సిబ్బందికి తెలంగాణ రాష్ట్రం అసెంబ్లీ ఎన్నికల ప్రాముఖ్యతను వివరిస్తూ,ఎన్నికల విధులు ఏ విధంగా పకడ్బంధీగా నిర్వహించాలి అని,సిబ్బంది చేయవలసిన,చేయకూడని విధుల గురించి జిల్లా ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ క్షుణ్ణంగా వివరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలి వెళ్లరాదన్నారు.ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా ఉండాలని,అనవసర విషయాలు చర్చించవద్దన్నారు.పోలింగ్ జరుగుతున్న సమయంలో పోలింగ్ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే ఏ చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు.ఓటర్లు ఎవ్వరూ కూడా సెల్‌ఫోన్‌లు,మందుగుండు,సామాగ్రి,ఇంక్ బాటిల్స్,వాటర్ బాటిల్స్,పోలింగ్ బూత్‌లోనికి తీసుకువెళ్లరాదని,సెల్ఫీలు దిగడం నిషేదం అన్నారు.పోలింగ్ ముగిసిన తరువాత ఉన్నతాధికారులు ఆదేశాలు లేనిదే ఎవ్వరూ కూడా తమ విధుల నుండి వెళ్లరాదన్నారు.ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. భారత ఎన్నికల సంఘంచే అమలు చేస్తున్నామన్నారు.జిల్లా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా,శాంతి భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడినా నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.విధులు నిర్వహించే పోలీసులకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఎఆర్) అదనపు ఎస్పీగా ఆర్.జనార్ధన్‌రెడ్డి,డిఎస్పీ వెంకట స్వామి,టౌన్ ఇన్స్పెక్టర్ నటేష్,సిఐలు, ఎస్సైలు,వివిధ జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికలకు పోలింగ్ బూత్‌లు సిద్ధం

**మెట్‌పల్లి అర్బన్ - ప్రభాతవార్త :** సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మెట్‌పల్లి డివిజన్ కేంద్రంలోని మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండల కేంద్రాలతో పాటు మండలాల్లో నేడు ఎన్నికలు జరగనున్న తరుణంలో పోలింగ్ బూత్ కేంద్రాలను సంబంధితాధికారులు సిద్ధం చేశారు. కాగా మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో, సంబంధితా కార్యాలయాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి అలంకరణతో ముస్తాబు చేశారు. అలాగే ఎన్నికల అధికారులు సంబంధితా పోలింగ్ బూత్ కేంద్రాలలో ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందికి ఈవిఎం మెషిన్లు, పోలింగ్ సామాగ్రిని అందజేశారు. అలాగే ఆయా మండలాలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేశారు. అలాగే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు.

**మెట్‌పల్లిలో ఆకట్టుకుంటున్న పోలింగ్ కేంద్రం...** సాధారణ ఎన్నికలు నేడు జరగనున్న నేపథ్యంలో పట్టణంలోని సమావేశ మందిరం పోలింగ్ బూత్‌గా ఏర్పాటు చేయగా సమావేశం మందిరంను పెళ్ళి వేడుకకు ఏర్పాటు చేసే రకంగా ముందర స్వాగత తోరణాలతో ముస్తాబు చేశారు.కాగా నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్ కేంద్రాలను అందంగా ముస్తాబు చేయనున్నట్లు సంబంధితాధికారులు పేర్కొన్నారు.

# శాసనసభ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి





**- ఈవీఎంలతో గ్రామాలకు తరలిన సిబ్బంది**

**జమ్మికుంట (హుజురాబాద్ ఆర్‌సీ), ప్రభాతవార్త :** హుజురాబాద్ శాసనసభ నియోజక వర్గానికి గురువారం రోజున జరగనున్న సాధారణ ఎన్నికల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హుజురాబాద్ శాసనసభ నియోజక వర్గంలో మొత్తం 305 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటి నిర్వహణకు గాను 305మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 305 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు 610మంది పోలింగ్ సిబ్బందిని వీరికి సహాయకంగా ఒక పోలీస్‌ను నియమించారు. మొత్తం 1310మంది సిబ్బందిని నియోజక వర్గంలో విధులు నిర్వహించటానికి కెటాయించగా కొన్ని కేంద్రాల్లో 1200 ఓట్ల కన్నా ఎక్కువ ఉన్న ప్రాంతంలో మరో 30 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. 30 మంది సెక్టార్ ఆఫీసర్లు, 30 మంది రూట్ ఆఫీసర్లను ఏర్పాటు చేసి ఎన్నికలను సాఫీగా జరగటానికి రిటర్నింగ్ అధికారి చర్యలు తీసుకున్నారు. వీరికి తోడు పోలీస్ సిబ్బంది సాయుధ బలగాలు సుమారు 650 మంది విధులకు కెటాయించారు. నియోజకవర్గంలోని హుజురాబాద్ జమ్మికుంట కమలాపూర్ వీణవంక ఇల్లందకుంట మండలాల్లో 82 సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. వీరి కోసం సుమారు 100 బస్సులను, జీపులు, కార్లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క రూటుకు ఒక్కో బస్సు చొప్పున ఏర్పాటు చేసి వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. గురువారం పోలింగ్ జరిగే సమయానికి ముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. నిర్వహణ సమయంలో ఎలాంటి అంతరాయాలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ అనుకోని సమస్యలు ఎదురైనప్పుడు తప్పని సరిగా సెక్టారు ఆఫీసర్ల దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. వీరికి తోడు మాడల్ కోడ్ ఆఫీసర్లు నోడల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి బుధవారం మద్యాహ్నాం నుండి పోలింగ్ సిబ్బంది తమకు ఇచ్చిన పోలింగ్ మెటీరియల్‌తో పోలీసులతో కలిసి వారికి కెటాయించాన రూట్ బస్సులలో గ్రామాలకు తరలి వెళ్ళారు.





# హుస్నాబాద్ నియోజక వర్గంలో కారుకే విజయావకాశాలు ఎక్కువ

**- ఏడు మండలాల ఆపన్నహస్తంగా ప్రజల మదిలో ఒడితెల పదిలం**
**- మెజారిటీ పునరావృత్తం అవుతుందా అంటే సందేహించాల్సిందే**
**- హాట్రిక్ కొట్టబోతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఒడితెల సతీష్‌కుమార్**

**చిగురుమామిడి, ప్రభాతవార్త :** హుస్నాబాద్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఒడితెల కుటుంబం నుండి మూడో సారిగా హాట్రిక్ దిశగా గెలుపొందటానికి సతీష్‌కుమార్ నియోజకవర్గ ఆపన్న హస్తంగా ప్రజల మదిలో ఒడితెల పదిలమా అంటే అరవై శాతం పబ్లిక్ టాక్ రిపోర్టు అవుననే సంకేతాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. మిగిలిన నలభై శాతం రిపోర్టు ఓ ప్రధాన పార్టీకే ఉండబోతున్నట్లు సమాచారం. దాదాపు నియోజక వర్గంలోని ఏడు మండలాల్లో సతీష్‌కుమార్ సౌమ్యుడు, శత్రువుకు సైతం సాయం చేసే గుణం కలిగిన నాయకుడు అని ప్రజలు విశ్వసిస్తున్నారు. పదేళ్ళ పరిపాలనలో వివాదాలు, అల్లర్లు కనిపించనివ్వని సుపరిపాలనగా చుట్టు పక్కల నియోజక వర్గాల ప్రజలు, నాయకులు సైతం చెప్పుకోవడం విశేషం. ఇక సతీష్‌కుమార్ రెండవ సారి గెలుపొందిన ఓట్లలో దాదాపు డెబ్బై వేలకు పైచిలుకుగా వచ్చిన మెజారిటీ మూడవసారి పునరావృత్తం అవుతుందా అంటే కాస్త సందేహించాల్సిందే. ఎందుకంటే ఇతర ప్రధాన పార్టీలు కూడా హుస్నాబాద్ బరిలో ఉండి గట్టి పోటీని ఇవ్వడమే ఇందుకు కారణంగా తెలుస్తుంది. రాబోవు మరో అయిదేళ్ళలో కూడా నియోజక వర్గ అభివృద్ధి సుభీక్షంగా జరగటానికి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఒడితెల సతీష్‌కుమార్‌కే నియోజక వర్గంలో విజయావకాశాలు మెండుగా ఉన్నాయనే సర్వే నివేదికలే ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. జనంలో మాత్రం తెలంగాణ ప్రభుత్వం అంటే మాదే అనే బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నంత కాలం బీఆర్ఎస్ పార్టీ మెజారిటీ గెలుపు కష్టం అవుతుంది అని, ప్రభుత్వం మాదే అనే భావన పక్కన పెట్టి తెలంగాణ ప్రభుత్వం అంటే మనది, మన అందరిది అని ఎల్లప్పుడు ముక్త కంఠంతో కొనసాగితేనే ఒడితెలకు మెజారిటీతో కూడిన గెలుపునకు మార్గం సుగమం అవుతుందని రాజకీయ విశ్లేషకులు, తెలంగాణ అభిమానులు, నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. ఏ ప్రభుత్వం అయినా అందించే సంక్షేమ ఫలాలు మొదటగా సామాన్యుడికి మాత్రమే చేరాలని, అటు పిమ్మట ఇతరులకు చేరితేనే పార్టీలకు గానీ నాయకులకు గానీ భవిష్యత్ ఉంటుందని హుస్నాబాద్ నియోజక వర్గ ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.



# పోలింగ్ కేంద్రాల్లో సకల సౌకర్యాలు

**- మున్సిపల్ కమీషనర్**
**పి. శాంతికుమార్**

చొప్పదండి ప్రభాతవార్త: తెలంగాణ శాసనసభ సాధారణ ఎన్నికలు 2023 ఎన్నికల నిర్వహణ కార్యక్రమంలో మున్సిపల్ పి. శాంతికుమార్ ఆద్వర్యంలో పురపాలక సంఘం చొప్పదండి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల గాందీనగర్ (చింతలబడి) మూడు పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ నిమిత్తం ప్రజా సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ కమీషనర్ శాంతికుమార్ మాట్లాడుతూ పట్టణంలోని ఓటర్ల మౌళిక సదుపాయాల నిమిత్తం త్రాగునీరు, వికలాంగుల సౌకర్యార్థం వీల్ చైర్లు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, విద్యుత్ లైట్లు, అత్యవసర వైద్య సేవల నిమిత్తం అంబులెన్స్ ప్రత్యేక అలంకరణలతో సర్వం సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. పట్టణ ఓటర్లు తమ ఓటును తమయొక్క పోలింగ్ స్టేషన్లలో తప్పకుండా వినియోగిం చుకుని ఓటింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# కరీంనగర్ వార్త

## ఎన్నికలకు సర్వం సిద్ధం

**ఎలిగేడు,ప్రభాతవార్త :**

గురువారం జరిగే సార్వత్రిక ఎఇన్నకలకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.మండలంలో 22 పోలింగ్ బూతులు ఉండగా పురుషులు తొమ్మిది వేల ఐదు మహిళలు తొమ్మిది వేల రెండు వందల ఆరవై ఒక ట్రాన్స్ జెండర్ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండలంలో మొత్తం 18266 మంది ఓటర్లు ఉన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సివిల్ పోలీసులతో పాటు కేంద్ర బృందాలు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఎన్నికల కోసం పూర్తయిన ఏర్పాట్లు

**పోలింగ్ కేంద్రాలకు ఈవిఎంల తరలింపు**

**ధర్మపురి,ప్రభాతవార్త :**





అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఈనెల 30న నిర్వహించే పోలింగ్ కోసం ఎన్నికల అధికారులు బుధవారం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ధర్మపురి కళాశాల మైదానంలో ఎన్నికలకు అవసరమైన ఈవిఎంలు,సామాగ్రిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేపట్టగా అధికారులు, సిబ్బంది ఉదయం వేళలో కళాశాల వద్దకు చేరుకున్నారు.గురువారం నిర్వహించే పోలింగ్ కోసం ధర్మపురి నియోజకవర్గంలో 269 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.అలాగే 269 మంది పిఓలు,269 మంది ఎపిఓలు తమకు కేటాయించిన ఈవిఎంలు ఇతర సామాగ్రిని ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లారు.పోలింగ్ కోసం 607 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, నియోజకవర్గంలో 79 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. నియోజకవర్గంలో 26 రూట్ల ఏర్పాటు చేయగా ఎన్నికల నిర్వహణ కోసం 300 మంది ప్రత్యేక పోలీస్ బలగాలు తమ విధులు నిర్వహిం చేందుకు ఏర్పాటు చేశారు.ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు సందర్శించారు.ఎన్నికలు పకడ్బం ధీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని ధర్మపురి నియోజ కవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర్ పేర్కొన్నారు.

## మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

**మెట్‌పల్లి - ప్రభాతవార్త :**

ఎన్నికల కోడ్‌లో భాగంగా మెట్‌పల్లి డివిజన్‌లో పరిధిలోని బార్‌లు, వైన్స్‌లను మెట్‌పల్లి ఎక్సైజ్ సిఐ రాధ బుధవారం పరిశీలించి వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు మెట్‌పల్లి ఎక్సైజ్ సిఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని డివిజన్ పరిధిలో ఎక్కడైన అక్రమంగా మద్యం సరఫరా చేసినా, అమ్మినా సమాచారం అందించాలని తెలిపారు. అక్రమంగా మద్యం రవాణా చేస్తే సంబంధితా వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడే అసెంబ్లీ ఎన్నికలు.. ఎన్నికలకు సర్వం సిద్ధం

### ఉదయం నుండి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్

కోరుట్ల, ప్రభాతవార్త






కోరుట్ల నియోజకవర్గ పరిధిలో గురువారం జరిగే ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల అధికారులు రాజీవ రాజన్ మీనా, రాజేశ్వర్‌లు తెలిపారు. పట్టణంలోని ఎస్‌ఎఫ్ఎస్ పాఠశాలలో అబ్జర్వర్స్, పీఓ, ఏపీఓ, ఓపీఓలకు ఎన్నికల తీరు, వివిప్యాట్స్, ఈవీయంలపై అవగాహన కల్పించి, రూట్ మ్యాప్స్ ఏర్పాటు చేసి ఎన్నికల కేంద్రాలకు తరలించారు. మొదటగా స్థానిక పాఠశాలలో స్ట్రాంగ్‌రూమ్స్ సీల్ ఓపెన్ చేసి ఈవీయం,వివి పాట్స్‌లను పరిశీలించారు. కోరుట్ల నియోజకవర్గంలో 2,40,855 ఓటర్లుండగా అందులో పురుషులు 1,15,027, మహిళలు 1,25,824, ట్రాన్స్‌జెండర్స్ 4గురు ఉన్నారు. కోరుట్ల పట్టణంలో పురుషులు 28,916, మహిళలు 30,590, ట్రాన్స్‌జెండర్ 1, కోరుట్ల మండలంలో పురుషులు 14,495, మహిళలు 15,966, మెట్‌పల్లి పట్టణంలో పురుషులు 21,484, మహిళలు 22,582, ట్రాన్స్‌జెండర్ 2, మెట్‌పల్లి రూరల్‌లో పురుషులు 17,021, మహిళలు 19,093, ట్రాన్స్‌జెండర్ 1, ఇబ్రహీంపట్నం మండలంలో పురుషులు 14,189, మహిళలు 16,287, మల్లాపూర్ మండలంలో పురుషులు 18,922, మహిళలు 21306 మంది ఉన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో మొత్తం 262పోలింగ్ స్టేషన్‌లుండగా అందులో కోరుట్ల పట్టణంలో 54, మండలంలో 35, మెట్‌పల్లి పట్టణంలో 47, మండలంలో 39, ఇబ్రహీంపట్నంలో 37, మల్లాపూర్‌లో 50పోలింగ్ కేంద్రాలుండగా, అందులో 135సమస్యాత్మక కేంద్రాలున్నాయని, 20రూట్స్ ద్వారా ఎన్నికల నిర్వాహణ కొనసాగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 262పోలింగ్ స్టేషన్‌లు ఉండగా అందులో పీఓలు 262 మంది, ఏపీఓలు 262 మంది, ఓపీఓలు 524మందితో మొత్తం 1048 మంది విధుల్లో పాల్గొనున్నట్లు వివరించారు. కోరుట్ల నియోజక వర్గంలోని ఉద్యోగులు ఇప్పటి వరకే వారి ఓటు హక్కును నమోదు చేసుకోగా, 80సంవత్సరాల పైబడిన 3వందల మందికి పైగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ప్రత్యేక వాహనాల ద్వారా ఎన్నికల అధికారులను వారికి కేటాయించిన సెంటర్‌లకు తరలించారు. ఎస్‌ఎఫ్ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్నికల సమాయత్త కేంద్రాన్ని ఎస్పీ సంప్రీత్ సింగ్, ఎఎస్పీ భీంరావు, డీఎస్పీ రవీంద్రరెడ్డి పరిశీలించారు. నేడు ఉదయం నుండి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహించబడుతుందని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

# పోలింగ్ కేంద్రాలకు తరలిన పోలీస్ బలగాలు

**- 144 సెక్షన్ అమలు...**

**-సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా...!!!**

మల్యాల, ప్రభాత వార్త:

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు మల్యాల పోలీస్ సర్కిల్ పరిధిలోని మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి మండలాలలో పోలింగ్ కేంద్రాలకు బుధవారం పోలీస్ బలగాలను తరలించారు. ఈ సందర్భంగా మల్యాలకు చేరిన బిఎస్ఎఫ్ బలగాలు, మహారాష్ట్రకు చెందిన పోలీసులతో పాటు హోంగార్డులకు ఎన్నికల డిఎస్పి వెంకటేశ్వర్లు, మల్యాల సిఐ బిల్లా కోటేశ్వర్ లు పోలింగ్ కేంద్రాలకు ఈవిఎం ల తరలింపు, తిరిగి స్ట్రాంగ్ రూములకు తరలించేందుకు గట్టి భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా మూడు మండలాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అయిదురు కంటే ఎక్కువ ఒకేచోట ఉండరాదని, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బార్డర్ లైనింగ్ అతిక్రమించి ప్రచారం నిర్వహించినా, ఓటర్లను ప్రలోభా లకు గురిచేసినా, భయ బ్రాంతు లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఎన్నికలు సజావు నిర్వహణకు ఇప్పటికే రౌటీషీటర్లు ట్రబుల్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ సందర్భంగా రాజారం, దొంగల మర్రి వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అసాంఘిక శక్తులను అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ఓటర్లు నిర్భయంగా ప్రశాంత వాతావ రణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సిఐ కోటేశ్వర్ కోరారు. కాగా బిఎస్ఎఫ్ బలగాలు 60, మహారాష్ట్ర పోలీస్ హోం గార్డులు 150, స్థానిక పోలీసులు మొత్తం కలిపి 300 మంది తో పాటు ఒక డిఎస్పీ, ఇద్దరు సిఐ లు, 4 గురు ఎస్ఐలు బందోబస్తు చేపట్టనున్నారు.



## వైభవంగా శ్రీసోమేశ్వర ఆలయంలో ఆరుద్రోత్సవం

**-108లీటర్ల ఆవుపాలతో ఏకాదశ రుద్రాభిషేకం**

పాలకుర్తి, నవంబరు 29 ప్రభాతవార్త :

పాలకుర్తి మండలకేంద్రంలోని కోరిన కోర్కెలు తీర్చే ప్రముఖ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన స్వయంభూ శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో కార్తీక మహోత్సవంలో భాగంగా ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఆరుద్రోత్సవం కార్యక్రమం మేళతాళాలు, అర్చకుల వేదమంత్రోచ్ఛారణల మధ్య మహా వైభవోపేతంగా జరిగింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు ఏకాదశ రుద్రాభిషేకం 108లీటర్ల ఆవుపాలతో అభిషేకం, గర్భాలయ దీపోత్సవం, పుష్పాలంకరణ, విశేష నీరాజనములు, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ వైభవంగా నిర్వహించారు. ఈ ఆరుద్రోత్సవం కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కనులారా తిలకించి తరించారు. ఈసందర్భంగా శ్రీరామదాసు భజనమండలి ఆధ్వర్యంలో భజన బృందాలచే నిర్వహించిన భజనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న, అర్చకులు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## జిల్లాలో పోలింగ్‌కు సర్వం సిద్ధం

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య**

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :

జిల్లాలోని మూడు నియోజకవర్గాలు 098 జనగామ, 099 స్టేషన్‌ఘన్‌పూర్, 100 పాలకుర్తిలలో జరిగే శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య అన్నారు. ఈసందర్భంగా మూడు నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న పనుల గురించి రిటర్నింగ్ అధికారి కార్యాలయాలు పంపిణీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి శివలింగయ్య మాట్లాడుతూ జిల్లాలో మూడు నియోజకవర్గాలలో జరుగుతున్న ఎన్నికల నిర్వహణపట్ల తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీచేశారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. పంపిణీ కేంద్రాల ద్వారా ఎన్నికల సామాగ్రి చేయడం జరుగుతుందని, ఎన్నికల విధులలో పాల్గొని సిబ్బంది అధికారులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రతీక్షణం అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.

# కోరుట్ల వార్త



## నేడే పోలింగ్... ఎన్నికలకు సర్వం సిద్ధం

ప్రభాతవార్త-సుబేదారి:



హనుమకొండ జిల్లాలోని వరంగల్ పశ్చిమ,పరకాల నియోజకవర్గాల్లో గురువారం జరగనున్న పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. వరంగల్ ఏనుమాములలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వరంగల్ పశ్చిమ,పరకాల నియోజకవర్గాల ఈవీఎంల పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే పోలింగ్కు సర్వం సిద్దం చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అంతా సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఎన్నికలను పకడ్బందిగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈవీఎంలతో పాటు ఇతర పోలింగ్ సామగ్రి తరలింపును కట్టుదిట్టమైన భద్రత మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ ఈవీఎంలు ఇతర పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ విధులకు హాజరైన అధికారులు సిబ్బంది హాజరు వివరాలను జనరల్ అబ్జర్వర్ డాక్టర్ హెచ్.గోపాలకృష్ణ, పోలింగ్ అబ్జర్వర్ తోగో కర్గా, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అడిగి తెలుసుకున్నారు. పోలంగ్ అధికారులు సిబ్బందితో మాట్లాడారు. ఈవీఎంల మెమోను పరిశీలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, పోలింగ్ అధికారులు, అదనపు పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులకు కలెక్టర్ సలహాలు సూచనలు చేశారు. ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి పోలింగ్ కేంద్రాలకు తరలించే వాహనాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఏనుమూములలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య సేవలను పరిశీలించారు. ఎన్నికల విధులలో పాల్గొంటున్న పోలింగ్ సిబ్బందికి భోజన సదుపాయాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు గురించి పోలీస్ అధికారులు సిబ్బందికి సెంట్రల్ జోన్ బిసిపి ఎంఎ భారీ పలు సూచనలు చేశారు. వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు ఎన్నికల సామగ్రితో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది వాహనాల ముందు జిల్లా జనరల్ అబ్జర్వర్ డాక్టర్ హెచ్.ఎన్ గోపాలకృష్ణ, కలెక్టర్ సిక్తా పట్నాయక్ జెండా ఊపి ప్రారంబించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హహేందర్ జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్దా శుక్లా, రిటర్నింగ్ అధికారులు రమేష్, శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు

**-డీసీపీ సీతారాంనాయక్**

పాలకుర్తి, నవంబరు 29 ప్రభాతవార్త :

పాలకుర్తి నియోజకవర్గంలో జరగబోయే ఎన్నికల ప్రక్రియలో జనగామ డీసీపీ సీతారాం ఆధ్వర్యంలో ఏసీపీ వర్ధన్నపేట ఎన్నికల నోడల్ ఆఫీసర్ రఘుచందర్, సీఐ పాలకుర్తి, వర్ధననపేట పర్యవేక్షణలో దాదాపు 900మంది పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈసందర్భంగా డీసీపీ సీతారాం ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలతో సిబ్బందితో కలిసి దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు, 144సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు సహకరించి ఎన్నిక ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జనగామ జోన్, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక లారీలతోనే ప్రమాదాలు

మేడారం, ప్రభాతవార్త :



ఇసుక లారీలతోనే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తీవ్ర గాయాలతో మృతి చెందడం, స్వల్ప గాయాలతో ఆసుపత్రి పాలు కావడం జరుగుతుంది. రెండు రోజుల కిందట ఏటూరునాగారం చెక్‌పోస్టు ఇవతల వేగంగా వస్తున్న ఇసుక లారీ కారును ఢీ కొట్టింది. కారుకు కుడి వైపున తగలిన ప్రమాదంతో అందులో ప్రయాణిస్తున్న ఒక యువకుడు కుడి చెయ్యి విరిగి తలభాగం అంతా తీవ్రంగా గాయపడింది. చెక్ పోస్టు వద్దనే ఈ సంఘటన జరగడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. అడ్డు అదుపు లేకుండా వేగంగా వెళ్తున్న ఇసుక లారీలతో ప్రాణాంతకంగా మారింది. వీటిని అదుపు చేసి వేగాన్ని నియంత్రణ చేసే వాళ్ళే కరువయ్యారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

**-రోడ్లు నాశనం .. వంతెనలు కూలడం**

ఇసుక లారీలతో రోడ్లు నాశనం కావడం, వంతెనలు పోవడం వంటివి జరుగుతున్నాయి. తాడ్వాయి సమీపంలోని జలగలంచ వంతెనపై రోడ్డంతా కొట్టుకుపోయింది. ప్రమాదం అంచునకు చేరుకుంది. ఈ వంతెనపై పెద్ద పెద్ద గొయ్యి పడింది. హైవే పై గల ఈ వంతెన కూలితే రవాణా అంతా నిలిచిపోతుంది. వారం రోజుల పాటు ప్రయాణికులు నరకయాతన పడాల్సి వస్తుంది. వర్షాకాలంలో తాత్కాలికంగా వేసిన ఇసుక బస్తాలు సైతం కొట్టుకుపోయాయి. ప్రమాదం పొంచి ఉంది. అంతేకాకుండా దీనికి సమీపంలో గల గుండ్ల వాగు వంతెన కూడా రెండు ప్రదేశాలలో గుంతలు పడ్డాయి. వాహనాల రాకపోకలకు తాత్కాలికంగా పనులు చేపట్టారు. ఇసుక లారీల రవాణా వలన ఆ గుంతలు కాస్తా పెద్దదిగా మారాయి.

**-పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా అధికారులు**

జలగలంచ వంతెన రోడ్డంతా కొట్టుకుని పోయింది. ఈ విషయం సంబంధిత శాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులకు తెలిసినప్పటికి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు సైతం చూసి చూడనట్లుగా ఉంటున్నారు. ఈ రెండు వంతెనలు కూలితో రవాణా కష్టాలు ఏర్పడతాయి. ఈ పనులు మరమ్మత్తుల్లో చేపట్టే దాక తాడ్వాయి క్రాస్ నుండి మేడారం నుండి వెళ్ళాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెండు వంతెనలపై తాత్కాలిక పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## డబ్బులు పంపిణీ చేసిన వ్యక్తులపై కేసు నమోదు

చందుర్తి, ప్రభాతవార్త.



ఎన్నికల్లో ప్రలోభాలు పెట్టి డబ్బులు పంచుతున్న బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అయిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు. చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన తర్రే లక్ష్మణ్, గుడిసె గంగయ్య, లింగంపల్లి గంగరాజు, గంగాధర కిరణ్ కుమార్‌లు బుధవారం బిఆర్ఎస్ పార్టీ తరుపున డబ్బులు పంచుతుండగా, అందిన సమాచారం మేరకు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

చందుర్తి, ప్రభాతవార్త.



చందుర్తి మండలంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు 33 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలో 20 గ్రామాల్లో 33 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కేంద్రంలో నలుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ సామాగ్రితో బుధవారం సాయంత్రం కేంద్రాలకు చేరారు. పోలింగ్ సిబ్బంది కేంద్రాలలో రాత్రే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఉప్పరపల్లిలో విద్యార్థి వాలంటీర్ల ఏర్పాటు

చెన్నారావుపేట, నవంబర్ 29, ప్రభాతవార్త

మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో ఎన్నికల కోసం పాఠశాల విద్యార్థులను వాలంటీర్లుగా ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు సహాయపడేందుకు ఎన్నికల కమీషన్ ఆదేశం మేరకు కొంత మంది విద్యార్థులను వాలంటీర్లుగా ఏర్పాటు చేసినట్లు పాఠశాల హెచ్ఎం జయ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు చెలుకలపల్లి సిద్ధార్థ, ప్రభాకర్, నిక్సన్, మురళీకృష్ణలు, సహాయకులుగా ఉండనున్నారు. విద్యార్థులు పూర్తి స్థాయిలో తగు సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

## నేడు జరగబోవు ఎన్నికలకు భారీ బందోబస్తు

**-రెండు వేలకుపైగా పోలీసు బలగాల రాక -ప్రత్యేకమైన వ్యూహంతో కదులుతున్న జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపీఎస్**

ప్రభాతవార్త, ములుగు :



గురువారం జరగబోవు తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సజావుగా సాగేలా పోలీస్ శాఖ తరపున జిల్లా ఎస్పీ తగు అన్ని చర్యలను చేపట్టారు. ములుగు జిల్లాకు ఇప్పటికే సెంట్రల్ అర్మడ్ పోలీస్ ఫోర్స్ బలగాలు 19 కంపెనీలలో 1300 మంది విచ్చేసారు. జిల్లా పోలీసు విభాగంలో 650 మంది ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుండి హోంగార్డ్స్‌ను 300 మందిని ఇతర డిపార్ట్మెంట్స్ నుండి 78 మందిని ఎలక్షన్ విధులకు కేటాయించచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో 307 పోలింగ్ కేంద్రాలు 202 పోలింగ్ లొకేషన్స్ ఉన్నాయని వీటిలో సాధారణ, సమస్యత్మక, మావోయిస్టులచే హాని ఉన్న పోలింగ్ కేంద్రాలుగా విభజించామని, దానికి అనుగుణంగా భద్రత చర్యలు చేపట్టామని తెలియజేశారు. ములుగు జిల్లాలో వామపక్ష తీవ్రవాద ప్రాబల్యం ఎక్కువగా ఉన్నందున ఎన్నికలలో ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రత్యేకమైన యాక్షన్ ప్లాన్‌తో ముందుకు వెళ్తున్నామని, మావోయిస్టు హానీ ఉన్న పోలింగ్ కేంద్రాల చుట్టూ మూడంచల భద్రత వ్యవస్థ పొందుపరిచామని, దీనిలో భాగంగా గ్రేహౌండ్స్ పార్టీ, జిల్లా స్పెషల్ పార్టీ, సెంట్రల్ అర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ లచే గస్తీ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. మారు మూల గ్రామాలలో అటవీ ప్రాంతాలలో ఈవీఎంల తరలింపులో భాగంగా ఎటువంటి ఆటంకం రాకుండా రోడ్డు ఓపెనింగ్ పార్టీలచే విస్తృత తనిఖీలు చేపట్టామని, వాటితో పాటు ఆకస్మిక వాహనాల తనిఖీ, బైక్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా స్ట్రైకింగ్ ఫోర్స్‌ను 10 టీములుగా విభజించామని, వీటిలో భాగంగా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీంతో పాటు అనుకొని సంఘటన సంభవిస్తే దాన్ని ప్రతిఘటించేలా క్విక్ రియాక్షన్ టీంను ఏర్పాటు చేశామని, ఇప్పటికే ప్రతి ఒక్క టీం తమ తమ స్థానాలలో విధులు సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారని ఎస్పీ తెలియజేశారు.

## ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

చెన్నారావుపేట, నవంబర్ 29, ప్రభాతవార్త

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వాహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మొత్తం మండలంలోని 31 గ్రామాలలో 40 పోలింగ్ బూత్‌లు అందుబాటులో ఉన్నాయి. అలాగే 40మంది ప్రొసీడింగ్ ఆఫీసర్లు, మరో 40మంది అసిస్టెంట్ ప్రొసీడింగ్ ఆఫీసర్లు, మరో 80మంది అదనపు ప్రొసీడింగ్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. మొత్తం మండలంలో 31273మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

మేడారం, ప్రభాతవార్త :



అడవిలో సంచరిస్తున్న కొండగొర్రె గొత్తెగూడెం చేరిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తాడ్వాయి సమీపంలోని కామారం గ్రామానికి దగ్గరగా నివసిస్తున్న గొత్తెకోయ గిరిజనులు మేకలు, పశువులతో అడవిలో మేతను మేపడానికి ప్రతి రోజు వెళ్తుంటారు. కామారం గ్రామం తరువాత మేడారం సమీపంలోకి వెళ్ళగానే కొండగొర్రె పల్లి ఒకటి మేకల మందలో కలిసింది. సాయంత్రం ఇంటికి చేరుకోగానే మేకలలో ఉన్న కొండ గొర్రె పిల్లను గొత్తికోయ గిరిజనులు చూశారు. భద్రాచలం పిల్లను దాచి మేక పాలు పట్టడం చేశారు. రెండు, మూడు రోజుల తరువాత అడవి జంతువు పిల్లను గూడెంకు చేరిన విషయాన్ని జంతు విభాగం అధికారులకు తెలిపారు. కొండగొర్రె పిల్లలను తీసుకుని వెళ్ళి వైల్డ్ లైఫ్ రేంజర్ చౌకత్అలీ ఆఫీసులో ఉండగా గొత్తికోయలు వెళ్ళి అతనికి ఇచ్చారు. జరిగిన విషయాన్ని అంతా అతని దృష్టికి తెచ్చారు. కొండగొర్రె పిల్లను అప్పగించిన కామారం గొత్తె కోయలను అభినందించారు. ఇతే తమ దృష్టికి తేవాలని ఆయన అన్నారు. కొండ గొర్రె పిల్లలను వరంగల్ తీసుకు వెళ్ళి జూ పార్కులో వేశారు. ఈ క్రమంలో అడవి జంతువుల సంరక్షణ చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అడవిలో ఉంటున్న అడవి జంతువుల పిల్లలు గ్రామాలకు చేరుతున్నాయి. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని అడవి జంతువుల సంరక్షణకు చర్యలు చేపట్టినట్లు అయితే బాగుంటుందని అంటున్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి స్వరూపారాణి, మరో సెక్షన్ అధికారి లింగయ్య, బీట్ అధికారి నవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు సర్వం సిద్ధం

**- మూడు నియోజక వర్గాలలో 732 పోలింగ్ బూత్‌లు**

**- పిఓలు 749, ఎపిఓలు 878**

**- నేడు ఉదయం 7 నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్**

జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :

అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా జగిత్యాల జిల్లాలోని మూడు నియోజక వర్గాలలో ఎన్నికలకు సర్వం సిద్ధం అయ్యాయి. జగిత్యాల జిల్లాలోని మూడు జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజక వర్గాలు ఉన్నాయి. కాగా జగిత్యాల నియోజకవర్గంలో ఓటర్లు 2, 31,468, అందులో మగ 1,11,720, ఆడ 1, 19, 7,28, , కోరుట్ల 2, 40.855, , మగ 1,15,07, ఆడ 1,25,824, , ధర్మపురి 2, 26,880, మగ 1,11, 172, ఆడ1, 15, 702 మం ది ఓటర్లు ఉన్నారు. ఈ మూడునియోజక వర్గాలలో మొత్తం 732 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి కాగా ఎన్నికల సిబ్బంది జగిత్యాల నియోకవర్గంలో పోలింగ్‌బూత్‌లు 254, పిఓలు 305, ఏపిఓలు 305, ఓపిఓలు 610, కోరుట్ల నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లు 262 , పిఓలు 314, ఏపిఓలు 314, ఓపిఓలు 628, ధర్మపురిలో నియోజక వర్గంలో పోలింగ్ బూత్‌లు 216, పిఓలు 130, ఏపిఓలు 259, ఓపిఓలు 610 మంది ఎన్నికల సిబ్బంది ఉన్నారు. కాగా ఉదయం ఉండి ఎన్నికల సిబ్బంది ఎన్నికలకు సంబంధించి ఈవిఎం మిషన్, ఇతర సామాగ్రి తీసుకొని ఓలింగ్ సిబ్బందితో వారి వారి పోలింగ్ కేంద్రాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాలలో భయలు దేరారు.

# ఎన్నికలకు సర్వం సిద్ధం

**- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎన్నికల సామాగ్రి పంపిణీ**
**- పంపిణీ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**
**- సిరిసిల్లలో 2,24,426 ఓట్లు... 287 పోలింగ్ స్టేషన్‌లు**
**- వేములవాడలో 2,22,251 ఓట్లు... 260 పోలింగ్ స్టేషన్‌లు**

**సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 29, ప్రభాతవార్త:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. గురువారం సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సిరిసిల్ల నియోజవర్గానికి సంబందించి సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో, వేములవాడ నియోజకవర్గంకు సంబందించి వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పంపిణీ కేంద్రాలకు చేరుకున్న సిబ్బందికి ఈవిఎంలు, ఇతర సామాగ్రిని అధికారులు అందించారు. పోలింగ్ సిబ్బంది బుదవారం సాయంత్రం లోపు ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఎన్నికలకు పూర్తి ఏర్పాట్లు చేయనున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 2.44,426 ఓట్లు, వేములవాడ నియోజకవర్గంలో 2,22,251 ఓట్లు ఉన్నాయి. సిరిసిల్లలో 287 పోలింగ్ స్టేషన్‌లు, వేములవాడలో 260 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లు వేములవాడ పరిధిలో 45, సిరిసిల్ల పరిధిలో 55 గుర్తించి అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. రెండు నియోజకవర్గాలలో పది మహిళ పోలింగ్ స్టేషన్‌లు, ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 91 మంది మైక్రో అబ్జర్వర్స్‌ను నియమించారు. సిరిసిల్లలో 688, వేములవాడలో 622 మంది సిబ్బంది ఎన్నికల నిర్వహణలో ఉన్నారు. నియోజవర్గాల కేంద్రంలోని పంపిణీ కేంద్రం నుంచి ప్రిసైడింగ్ అధికారులు, సహయ ప్రిసైడింగ్ అధికారులు, ఒపిఓలు ఎన్నికల సామాగ్రిని తీసుకుని ప్రత్యేకించిన వాహనాలలో వెళ్ళారు. సిరిసిల్ల నియోజకవర్గంలో సిరిసిల్ల పట్టణంలో 80,443 ఓట్లకుగాను 39,462 మంది పురుషులు, 40975 మహిళలు, వీర్నపల్లి మండలంలో 11,370 ఓట్లకు 5657 మంది పురుషులు5713 మహిళలు, ఎల్లారెడ్డిపేట మండలంలో 40,180 ఓట్లకు 19,566 మంది పురుషులు, 20,164 మహిళలు, గంభీరావుపేట మండలంలో 35,984 ఓట్లకు 17,549 మంది పురుషులు 18,434 మహిళలు, తంగళపల్లి మండలంలో 37,880 మంది ఓట్లకు 18,519 మంది పురుషులు, 19,659 మంది మహిళలు, ముస్తాబాద్ మండలంలో 38,569 మంది ఓట్లకు 18,910 మంది పురుషులు, 19,659 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. ఎన్ఆర్ఐ ఓట్లు 14, సర్వీస్ ఓట్లు 103 ఉన్నాయి. ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పరిశీలించారు.



### నిబంధనల మేరకు పారదర్శకంగా ఎన్నికల పోలింగ్ చేపట్టాలి
**- సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీష్ సాన్ కర్**

ఎన్నికల నిబందనల మేరకు పారదర్శకంగా ఎన్నికల పోలింగ్ జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలింగ్ సిబ్బందిదేనని సాదారణ పరిశీలకులు డాక్టర్ జగదీష్ సాన్ కర్ అన్నారు. బుదవారం సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను సాదారణ పరిశీలకులు డాక్టర్ జగదీష్ సాన్ కర్, ఎన్నికల పరిశీలకులు వినిత సాహు, ఎన్నికల వ్యయ పరిశీలకులు జి మణిగండసామిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిబందనల మేరకు పోలింగ్‌ను నిర్వహించాలన్నారు. ఉదయం 5 గంటలకే మాక్ పోలింగ్ చేపట్టలన్నారు. ఉదయం 7 గంటలకు వాస్తవ పోలింగ్ ప్రారంబించాలని తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని నివేదించాలని, ఈవిఎంలకు ఏమైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమనా, సెక్టార్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు నివేదించాలన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం నిబందనల మేరకు సీల్‌వేసి రిసెప్షన్ కేంద్రాలలో అప్పగించాలని చెప్పారు.





## పటిష్ట బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు ఈవిఎంలు తరలింపు

**- జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్**







**జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :** శాసనసభ ఎన్నికలు సందర్భంగా కోరుట్లలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుండి ఆయా ప్రాంతాలకు ఎన్నికల సామాగ్రి పటిష్ట బందోబస్తు మధ్య తరలించడం జరిగిందని ఎస్పీ తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 94 రూట్ మొబైల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ సందర్బంగా ఎన్నికల అబ్జర్వర్ రాజీవ్ రంజన్ మీనాతో మాట్లాడి ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ గురించి తీసుకుంటున్న చర్యలు గురించి ఆరా తీశారు.ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు,డిఎస్పీ రవీంధ్రరెడ్డి ఉన్నారు.

## జిల్లాలో పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం

**- కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ**
**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి**




**కరీంనగర్ ప్రభాతవార్త:** జిల్లాలో పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జిల్లాలోని 4 నియోజకవర్గాలు కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, హుజురాబాద్‌లలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 4 నియోజకవర్గాలలో జరుగు అసెంబ్లీ సాధారణ ఎన్నికల నిర్వహణపై తీసుకోవాలసిన చర్యలు, జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. పంపిణీ కేంద్రాల ద్వారా ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది అధికారులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రతిక్షణం అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజరాబాద్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మహేశ్వర్, ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, రాజు ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

మొదటి పేజి తరువాయి..

ప్రతి మండలానికి ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు,94 రూట్ మొబైల్స్,37 క్విక్ రియాక్షన్ టీమ్స్ ,స్ట్రయికింగ్ ఫోర్స్/ స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్/ 10 బిఎస్ఎఫ్ కంపెనీల కేంద్ర బలగాలు,మహారాష్ట్ర హోమ్ గార్డ్స్ 800 మంది,ఆర్టీసి,ఎపి పోలీస్ 160 మంది,సిఐడి పోలీస్ 46 మంది.అంతే కాకుండా పోలింగ్ స్టేషన్లో 347 మంది ఎన్‌సిసి/ఎన్ఎస్ఎస్ వాలంటీర్ కూడా ఉపయోగిస్తామని అన్నారు.

**జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వివరాలు :** జిల్లాలో మొత్తం పోలింగ్ స్టేషన్లు 927,సాధారణ పోలింగ్ స్టేషన్లు 676,సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 251.

**స్వాధీన పరుచుకున్న వివరాలు :** ఇప్పటి వరకు స్వాధీనపరుచుకున్న నగదు 2,59,17,681/- రూపాయలు.లిక్కర్ 6709 లీటర్లు,సుమారుగా అంచనా విలువ 31,89,467/- రూపాయలు.ఇతర సామాగ్రి 4608 సారీలు,1228 టవల్స్,950 సారీ పెట్టికోట్స్,1907 వైట్ షర్ట్స్,132 హ్యాండ్ బ్యాగ్,140 హాట్ బాక్స్,104 క్లాక్స్,21 స్వీయింగ్ మషీన్స్,తదితర వస్తువులు మొత్తం కలిపి అంచనా విలువ 1,56,38,048/- రూపాయలు.సీజ్ చేసిన నగదు,లిక్కర్,గోల్డ్,ఇతర వస్తువుల విలువ మొత్తం విలువ 4,63,03,410/- రూపాయలు.

**లైసెన్సుడు ఆయుధముల డిపాజిట్ :** ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నియమావళి అనుసారంగా లైసెన్సు కలిగిన ఆయుధములు అన్నియు డిపాజిట్ కొరకు అండర్ సెక్షన్ 144 అనుసరించి నిషేధాజ్ఞలు జారీ చేయడం జరిగింది.ఇప్పటికే జిల్లాలో ఉన్న మొత్తం 44 ఆయుధములు డిపాజిట్ కాబడినవి.

**జిల్లాలో ఇప్పటి వరకు బైండోవర్ చేయుబడిన వ్యక్తులు 3418...** గతంలో ఎలక్ట్రోరల్ నేరాలకు పాల్పడ్డ వ్యక్తులను,అందులో సహకరించిన వ్యక్తులను బైండోవర్ చేయుడమైనదని,రౌడీ షీట్ కలిగిన వారిని కూడా ముందస్తుగా బైండోవర్ చేయుడం జరిగింది.ఎన్నికల నియమావళి ఉల్లంఘనాలపై కఠినంగా ఉన్నామన్నారు.ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుండి ఇప్పటి వరకు జిల్లాలో ఎన్నికల నియామవళి ఉల్లంఘన కేసులు 40 నమోదు కావడం జరిగిందని ఈ యొక్క కేసులకు సంబందించి ధర్యాప్తు తర్వాత పూర్తి చేసి చార్జ్ షీట్ దాఖలు చేయడం జరుగుతుందన్నారు.



**చెక్ పోస్టులు :** అన్ని ప్రభుత్వ శాఖల సమక్షంలో,సమన్వయంతో జిల్లా సరిహద్దుల్లో ఉన్న 9 చెక్ పోస్టులలో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రణాళికతో ఏర్పాటు చేయడం జరిగింది.అంతే కాకుండా మొబైల్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు సర్‌ప్రైజ్ వెహికల్ చెకింగ్,నాక బంధి వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.ఇతర నియోజకవర్గం నుంచి ప్రచారానికి వచ్చిన వారు స్థానికంగా ఎవరు ఉందరాదని, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లలో బస చేస్తున్న ఇతర ప్రాంతాల వారు,రాజకీయ పార్టీల వారు ఉండకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికలు నియమావళి పాటిస్తూ స్వేఛ్చాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు.ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు,మద్యం,ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100కి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడిన,ఎన్నికల నియమావళి ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.